సమస్యల వలయంలో మధురానగర్



మధురానగర్ బస్తీలో
అంతర్గత రోడ్లపై పారుతున్న మురుగు

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- రోడ్లపైనే పారుతున్న మురుగు
- ప్రధాన – అంతర్గత రోడ్డుకు మధ్య లేని అనుసంధానం
- విన్నవించుకున్నా పట్టించుకోని అధికారులు

రాయదుర్గం: ఒకప్పుడు పేదల బస్తీగా క్వార్టర్స్ మాత్రమే నిర్మించారు. కానీ నేడు అన్నీ బహుళ అంతస్తుల భవనాలుగా మారాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌లో సమస్యలను తీర్చాలని స్థానికులు విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు అంతర్గత రోడ్లపై పారుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పూర్తిస్థాయిలో నిర్మించాల్సిన
మధురానగర్‌లోని సర్వీస్ రోడ్డు

బస్తీలో నెలకొన్న సమస్యలు ఇవే..

- ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనే కొనసాగుతోంది. దీనిని ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఉన్నా పట్టించుకోవడం లేదు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీతో పాటు మరో కొన్ని అదనపు తరగతి గదులను నిర్మించాలి.
- బస్తీలో రేషన్ దుకాణం లేక స్థానికులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది.
- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతోనే అంతర్గత రోడ్లపై మురుగు వరద పారుతోంది. బస్తీలోని 9వ అంతర్గత రోడ్లకు ప్రధాన రోడ్డుకు అనుసంధానం చేసే ర్యాంపుల నిర్మాణంలో జాప్యం. స్థానిక ప్రధాన రోడ్డు విస్తరించినా, సర్వీస్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- క్వార్టర్స్ బహుళ అంతస్తుల భవనాలు, హాస్టళ్ల నిర్మాణం చేసినా డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం పెంచకపోవడంతోనే మురుగు సమస్య తలెత్తుతోంది.
- ట్రాఫిక్ దృష్ట్యా దాబా కూడలిని విస్తరించాలి.

శాశ్వత పరిష్కారం చూపండి



మధురానగర్‌లో తక్షణం డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. క్వార్టర్స్ స్థానం నుంచి బహుళ అంతస్తుల భవనాలు, హాస్టళ్ల ఏర్పాటుతో డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం పెంచకపోవడంతోనే మురుగు రోడ్డుపై పారుతోంది. సర్వీస్ రోడ్డు నిర్మాణం, ప్రధాన రోడ్డుకు అనుసంధానం చేసే ర్యాంప్‌ల నిర్మాణం చేయాలి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి.

– ఆర్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి, మధురానగర్‌బస్తీ

దాబా కూడలిని విస్తరించాలి

వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా దాబా కూడలిని మాత్రం విస్తరించడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి ఇప్పటి వరకు చర్యలు తీసుకోవడంలేదు. మంచినీటి సరఫరాను రోజువిడిచి రోజు 20 నిమిషాలు సరఫరా చేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. బస్తీలో రేషన్‌షాపు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– రమేశ్‌గౌడ్, మధురానగర్‌బస్తీ



మధురానగర్‌లోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాల్సినవి ఇవే..

ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల పరిశీలన



కాలనీలో పర్యటిస్తున్న విద్యుత్ అధికారులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం పర్యటించారు. గచ్చిబౌలి డివిజనల్ ఇంజనీర్ యాదగిరి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శివకృష్ణప్రసాద్‌తో కలిసి కాలనీలో పర్యటించి కాలనీవాసులతో మాట్లాడారు. వారికి ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. పాతలైన్లంటినీ కొత్త లైన్లతో భర్తీ చేయాలని సూచించారు. ఇతర సమస్యలు అంతగా లేవని వారు చెప్పడంతో డీఈ స్పందిస్తూ త్వరలోనే భర్తీ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. అధికారులు కాలనీల్లో పర్యటించడంపై అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

ఆలయ స్లాబ్ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ స్లాబ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బి బ్లాక్ కాలనీలోని దక్షిణాముఖ అభయాంజనేయస్వామి ఆలయానికి నూతనంగా చేపట్టే స్లాబ్ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ విస్తరణలో భాగంగా నూతన స్లాబ్ నిర్మించుకోవడం చాలా సంతోషకరమన్నారు. భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని, స్లాబ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. ఆలయ అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అన్ని సాధ్యం

మానవ హక్కుల సంఘం చైర్‌పర్సన్
డా. జస్టిస్ షమీమ్ అక్తర్



విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేస్తున్న జస్టిస్ షమీమ్ అక్తర్ తదితరులు

మాదాపూర్: విద్యతోనే అన్ని సాధ్యమవుతాయని, సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని మానవ హక్కుల సంఘం చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో బుధవారం వైష్ణోయ్ గ్రూప్ కార్పొరేట్ కార్యాలయంలో వైఆర్పీ ఫౌండేషన్ రూ. 9 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను 40 మంది విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జస్టిస్ వైఆర్పీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యెలిశాల రవిప్రసాద్‌ని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఎం.జగదీశ్వర్, శరత్‌చంద్ర, హేమచంద్ర, ఎడ్ల కృష్ణారెడ్డి, యమ దయాకర్, చకిలం శేషగిరిరావు, వైఆర్పీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణా తరగతులు

కూకట్‌పల్లి: ఆంగ్ల వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం, సంగణన విజ్ఞానశాస్త్ర శిక్షణాంశాల్లో ఆదివారం ప్రత్యేక శిక్షణా తరగతులను కళాశాలల విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరంలో యువ వికాస్, శ్రీ రామకృష్ణ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ, మియాపూర్‌లలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నెలవారీ ఉపకార వేతనాలను అందిస్తున్నామని తెలిపారు. ఔత్సాహికులు శ్రీరామకృష్ణ వివేకానంద సేవా సమితి, ధ్యానమందిరం, ప్లాట్ 166, రాధామాధవ్ అపార్టుమెంట్ జంక్షన్ దగ్గర, ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీ, మియాపూర్, ఫోన్ 9059892038 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు నిర్మించాలని డీసీకి వినతి

కూకట్‌పల్లి: గోపాల్‌నగర్‌లో వర్షం కారణంగా 40 ఫీట్ల రోడ్డు గుంతలమయంగా మారిందని, రోడ్డు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు వర్షాలు తగ్గిన వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గాదె శివ చౌదరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమలతో వ్యాపించే వ్యాధులపై అవగాహన



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్: దోమల నివారణ, వాటిద్వారా వ్యాపించే వ్యాధులపై చందానగర్ డివిజన్ కాలనీల్లో, బస్తీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్‌లో శానిటేషన్, ఎంటమాలజీ అధికారులతో కలిసి ఆమె అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో వివిధ రకాల జబ్బులు, అంటు వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. చెత్త చెదారం స్వచ్ఛ పారిశుధ్య ఆటోల్లోనే వేయాలన్నారు. ప్రజల సహకారంతోనే పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. దోమల నివారణకు ఇళ్లలో చెట్ల కుండీలను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సుందర్, సత్తిబాబు, రత్నాకర్, వెంకటేష్, బోగశ్వర్‌రావు, సుధీర్, రాజు, లింగమూర్తి, పార్థసారథి, రాకేష్‌యాదవ్, కాలనీవాసులు నరేంద్ర, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ప్రశాంత్‌నగర్ ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్ పునఃరుద్ధరణ కోసం తవ్విన గుంత

మియాపూర్: ప్రధాన రోడ్లపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలోని ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్స్ పునఃరుద్ధరణ పనుల నిమిత్తం రోడ్డును తవ్వి వదిలేశారు. గతంలో బీటీరోడ్డు వేయడంతో ఈ రోడ్డు వెంబడి ఉన్న మ్యాన్‌హోల్స్ మూసుకుపోయాయి. ప్రస్తుతం ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో మరలా నూతన రోడ్డు పనులు చేపడుతున్నారు. దీంతో మూసుకుపోయిన మ్యాన్‌హోల్స్ వెలికి తీసేందుకు రోడ్డును పలుచోట్ల తవ్వి రోజుల తరబడి పునఃరుద్ధరణ పనులు చేపట్టకుండా వదిలేశారు. రోడ్డు మధ్యలో తవ్విన గుంతలతో వర్షాలు పడినప్పుడు వరదనీటిలో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో రోడ్లు ఎక్కడ తవ్వివదిలేయరాదని నిబంధనలు ఉన్నా అధికారులే తమ ఇష్టారీతినా రోడ్లను తవ్వుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శేరిలింగంపల్లి/రాయదుర్గం: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జయశంకర్‌సార్‌కు ఘన నివాళి

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని ఆయా డివిజన్లలో బుధవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్‌సార్ చిత్రపటానికి ఆయా పార్టీల నాయకులు, వివిధ సంఘాల సభ్యులు, స్థానికులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర మరువలేనిదన్నారు. ఉద్యమం కోసం తన జీవితానే త్యాగం చేసిన మహనీయుడు అని కొనియాడారు.



చందానగర్: జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్



శేరిలింగంపల్లి/రాయదుర్గం: లింగంపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, నాయకులు

'షానవాజ్, సర్ఫరాజ్ చంపేస్తామని బెదిరించారు'

రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేసిన రామకృష్ణ

గచ్చిబౌలి: ప్లాట్ డాక్యుమెంట్లు ఉన్నాయని ఓ వర్గం వారు విద్యుత్ మీటర్ తొలగించడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు వర్గాలు గొడవకు దిగడంతో ఓ వర్గంపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. అంజయ్యనగర్‌లో ప్లాట్ నెంబర్ 34/136లో రెండు దశాబ్దాలుగా ఎం.రామకృష్ణ అనే వ్యక్తి పొజిషన్‌లో ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు వచ్చి రామకృష్ణ ఇంటిలో ఉన్న విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేశారు. ప్లాట్ ఖాళీ చేయాలని బెదిరించడంతో కాలనీవాసులు బాధితుడికి మద్దతుగా రంగంలోకి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. షానవాజ్, సర్ఫరాజ్‌లు ప్లాట్ ఖాళీ చేయకుంటే చంపేస్తామని బెదిరించారని బాధితుడు తెలిపారు. విద్యుత్ మీటర్ తొలగించి అనుచరులతో దాడికి పాల్పడ్డారని రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టెలికాం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ అన్నారు. సదాశివపేట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి భద్రాచలంకు పాదయాత్రగా వెళ్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, వారి బృందాన్ని బుధవారం పటాన్‌చెరు ఓఆర్‌ఆర్ సమీపంలో సత్కరించారు. ఈసందర్భంగా టెలికాం బోర్డు మెంబర్ కుమార్ మాట్లాడుతూ.. పాదయాత్ర దిగ్విజయం కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలు పడే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. బుధవారం పట్టణంలో రెండు రోజుల క్రితం భారీ వర్షం కారణంగా ఇల్లు కూలిపోయిన సురేశ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాలు పడే సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రధానంగా వర్షాలు పడే సమయంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సురేశ్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

16న ఐటీ ఉద్యోగులకు ప్రత్యేక కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని 16న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'బియాండ్ పాస్‌వర్డ్ –ఎ క్స్‌ప్లోరింగ్ ది డీపర్ ప్రొటెక్షన్ ఫర్ ది ఇన్నర్ సెల్ఫ్'అనే అంశంపై బ్రహ్మకుమారీస్ విభాగం ఐటీ వింగ్ హైదరాబాద్ కోఆర్డినేటర్ బీకే అంజలి ప్రత్యేక ఉపన్యాసం ఉంటుంది. అనంతరం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించాలని తలపెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉచితంగా రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. అందుకోసం వెబ్‌సైట్ www.rhantirasovar.org ని వినియోగించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సైబర్ క్రైం సీఐ రవికుమార్

పటాన్‌చెరుటౌన్: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం సీఐ రవి కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియా ఎక్కువ వాడతారని, సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా యువతను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే రిక్వెస్ట్‌లను, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ సాయికిరణ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పటాన్‌చెరుటౌన్: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సత్య సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో మానవ విలువలను గుర్తించడం, సత్యాన్ని కాపాడడం, ఇతరులకు సేవ చేసే లక్షణాలను విద్యార్థులు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సత్య సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శంకరప్ప, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణతో పాటు ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ పూనమ్, డాక్టర్ యోగి బాబు, డాక్టర్ సురేష్ కుమార్ ఇతర అధ్యాపకులు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్య పరిష్కరిస్తా

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, తదితరులు

మియాపూర్: వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు నుంచి చందానగర్ గంగారం చెరువు వరకు నూతనంగా చేపట్టబోయే వరదనీటి కాల్వ నిర్మాణం పరిసర ప్రాంతాలను ఎస్ఎన్‌డీపీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటేల్ చెరువు నుంచి గంగారం చెరువు వరకు వరదనీటి కాల్వ నిర్మాణం చేపడుతామన్నారు. దీంతో చుట్టుపక్కల కాలనీల వరదనీటి ముంపు సమస్య తీరనుందన్నారు. వరదనీటి కాల్వ పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ డీఈ ధీరజ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేఐఎం డివిజన్ అధ్యక్షుడిగా సాయి సుకుమార్



సాయి సుకుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి

గచ్చిబౌలి: బీజేఐఎం కొండాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా గుమ్మడి సాయి సుకుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం శేరిలింగంపల్లి నియోజవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎం.రవికుమార్ యాదవ్ సుకుమార్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. బీజేఐఎం సిద్ధాంతాలు, ఆదర్శాలకు నిబద్ధతతో, క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల బీజేఐఎం అధ్యక్షులు జితేందర్, రాము యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్‌రావు
- రాయదుర్గం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల పరిశీలన



రాయదుర్గం జెడ్పీహెచ్ఎస్‌లో తరగతి గదిలో సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

రాయదుర్గం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్‌రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. తరగతులను సందర్శించి ఉపాధ్యాయుల బోధన చేసే విధానం, విద్యార్థులకు పాఠాలు అర్థం అయ్యే పరిస్థితి ఉందా? అని ఆయన పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై బోధన, పరీక్షలకు సంసిద్ధత అయ్యే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై బోధన, తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై పలు సూచనలు ఆయన చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడం రావాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల బోధనలో తప్పనిసరిగా టీఎల్ఎంను ఉపయోగించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసి లైబ్రేరీ, కంప్యూటర్ ఐఎఫ్‌బీ ప్యానల్స్ వంటి వాటిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్‌కేతాజ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపుతాం

పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ



నీటి కాల్వ నిర్మాణం చేసే ప్రాంతాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్

శేరిలింగంపల్లి: డోయన్స్ కాలనీ అవుట్ లెట్ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి డోయన్స్ కాలనీలో వరద ముంపు సమస్య పరిష్కారానికి డ్రైన్‌ను నిర్మాణ పనుల చేపట్టే ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ డోయన్స్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. వరద నీటి కాల్వ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ శిరీష, డీఈ ఆనంద్, కాలనీవాసులు లింగారెడ్డి, నర్సింహారెడ్డి, ప్రకాష్, రామకృష్ణ, అనంతరెడ్డి, నాయకులు మారబోయిన రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.